ఇరాన్‌పై పాక్ ప్రతీకారం

సియెస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు

నలుగురు పిల్లలు సహా 9 మంది మృతి

- పశ్చిమాసియాలో పతాకస్థాయికి ఉద్రిక్తత
- మా సార్వభౌమత్వాన్ని సవాల్ చేస్తే ఉపేక్షించం
- పాకిస్థాన్ అధ్యక్షుడు ఆరీఫ్ అల్వీ హెచ్చరిక
- ఇది ఆయా దేశాల అంతర్గత వ్యవహారం: భారత్

ఇస్లామాబాద్, జనవరి 18: బలూచిస్థాన్‌లో ఇరాన్ జరిపిన దాడులపై పాకిస్థాన్ ప్రతీకార చర్యలకు దిగింది. ఇరాన్‌లోని సియెస్థాన్-బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో ఉగ్రవాదులు తలదాచుకున్నట్టుగా భావిస్తున్న నిర్దిష్ట లక్ష్యాలపై గురువారం సైనిక దాడులు జరిపింది. దాడుల్లో నలుగురు పిల్లలు సహా తొమ్మిది మంది మరణించినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. దీంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. ఇప్పటికే ఓ వైపు గాజా స్ట్రిప్‌లోని హమాస్ సంస్థపై ఇజ్రాయెల్ దాడులు, మరోవైపు ఎర్ర సముద్రంలో హౌతీ ఉగ్రవాదులపై అమెరికా నేతృత్వంలో దాడులతో పశ్చిమాసియా అంతటా అల్లకల్లోలంగా ఉండగా.. ఇరాన్, పాక్ మధ్య దాడులతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఇరాన్ మరోవైపు ఇరాక్, సిరియాలపై కూడా క్షిపణులు, డ్రోన్ దాడులకు పాల్పడిందని అమెరికా వెల్లడించింది. పాకిస్థాన్, ఇరాన్‌లు సంయమనం పాటించాలని చైనా కోరగా, ఇరాన్, పాక్‌ల మధ్య దాడులు ఆయా దేశాల అంతర్గత వ్యవహారమని భారత విదేశాంగ శాఖ వ్యాఖ్యానించింది. 'ఆత్మరక్షణ కోసం ఆయా దేశాలు చేపట్టే చర్యలను మేం అర్థం చేసుకోగలం' అని తెలిపింది.

సోదర దేశమంటూనే దాడి

బలూచిస్థాన్‌లో ఇరాన్ మంగళవారం జరిపిన దాడిన తమ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే చర్యగా అభివర్ణించిన పాకిస్థాన్.. ఇందుకు తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించింది. ఈ నేపథ్యంలోనే 'మార్గ్ బర్ సర్మచార్ (గెరిల్లాలకు మరణం)' అనే కోడ్ పేరుతో ఇరాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడులు జరిపామని పాక్ విదేశాంగ శాఖ తెలిపింది. ఇరాన్ భూభాగంలో పాక్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని సుమారు ఏడు లక్ష్యాలపై కిల్లర్ డ్రోన్లు, రాకెట్లు, పేలుడు పదార్థాలతో దాడులు జరిపామని పేర్కొంది. ఈ దాడుల్లో బలూచిస్థాన్ విమోచన సైన్యం (బీఎల్ఏ), బలూచిస్థాన్ విమోచన ఫ్రంట్ (బీఎల్ఎఫ్)కు చెందిన మిలిటెంట్లు హతమయ్యారని పేర్కొంది. ఈ రెండు గ్రూపులు గతంలో పాకిస్థాన్‌లో అనేక దాడులకు పాల్పడ్డాయని తెలిపింది. ఇరాన్ తమ సోదర దేశమని ఆ దేశ సార్వభౌమత్వాన్ని పాక్ సంపూర్ణంగా గౌరవిస్తుందని పాక్ తెలిపింది. కేవలం తమ దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ దాడులు చేయాల్సి వచ్చిందని పేర్కొంది. 'పాక్ సార్వభౌమత్వాన్ని సవాలు చేసే ఏ చర్యను ఉపేక్షించబోం. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా స్పందించే హక్కు మాకుంది. ఇరాన్ ప్రజల పట్ల పాకిస్థానీలకు ఎంతో గౌరవం ఉంది. ఉగ్రవాద ముప్పుతో సహా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడంలో సంప్రదింపులు, చర్చలకు ఉన్న ప్రాధాన్యాన్ని మేం గౌరవిస్తాం' అని పాక్ విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది.

ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నాం

ఇరాన్, పాకిస్థాన్‌లు 900 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్నాయి. దీంతో రెండు దేశాల ఉగ్ర మూకలు తరచుగా ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు వస్తూ పోతుంటాయి. పాక్ మూలాలున్న ఉగ్రవాదులు ఇరాన్‌లోని కొన్ని ప్రదేశాలను స్థావరాలుగా చేసుకొని కార్యకలాపాలు సాగిస్తున్న సంగతిని ఎప్పటినుంచో హెచ్చరిస్తున్నామని ఇస్లామాబాద్ తెలిపింది. ఇందుకు తగిన ఆధారాలను కూడా ఇరాన్‌కు ఇచ్చామని, అయినప్పటికీ ఆ దేశ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని పేర్కొంది. ఇరాన్ అలసత్వం ఫలితంగా ఉగ్రవాదులు పాకిస్థాన్‌లో రక్తపాతానికి పాల్పడుతున్నారని తెలిపింది. ఈ నేపథ్యంలో పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో దాడులు జరిపామని వెల్లడించింది.

పాక్ అధ్యక్షుడి సమర్థన

ఇరాన్‌పై చేసిన దాడులను పాక్ అధ్యక్షుడు ఆరీఫ్ అల్వీ సమర్థించుకున్నారు. జాతీయ భద్రత, ప్రాదేశిక సమగ్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. తమ భూభాగాన్ని రక్షించుకొనేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. పక్కా సమాచారంతో అత్యంత కచ్చితత్వంతో తమ సైన్యం దాడులు జరిపిందని తెలిపారు. పాక్, ఇరాన్‌లు సహోదర దేశాలని, ఏమైనా సమస్యలుంటే చర్చలు, పరస్పర సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని అన్నారు. ఇరాన్‌తో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో.. దావోస్ పర్యటనలో ఉన్న పాక్ తాత్కాలిక ప్రధాని అన్వారుల్ హల్ కాకర్ హుటాహుటిన స్వదేశం తిరిగివచ్చారు.

పాక్‌పై ఇరాన్ దాడులను వ్యతిరేకిస్తూ ఇస్లామాబాద్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లిం మహజ్ పాకిస్థాన్ సభ్యులు

ఇరాన్‌పై అమెరికా ఆగ్రహం

ఇరాన్ 48 గంటల వ్యవధిలో మూడు దేశాల సరిహద్దులను ఉల్లంఘించి దురాక్రమణకు పాల్పడిందని అమెరికా విదేశాంగ శాఖ మండిపడింది. ఓ వైపు ఇరాన్ పశ్చిమాసియాలో ఉగ్రవాదాన్ని పెంచి పోషించేందుకు నిధులు సమకూరుస్తూనే.. మరోవైపు ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు దాడులు జరుపుతున్నామని చెప్పడం విస్మయం కలిగిస్తున్నదని అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ వ్యాఖ్యానించారు. 'ఇరుపక్షాలు ఉద్రిక్తతలను పెంచే చర్యలను నివారించాలి. ఈ ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలి' అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ పిలుపునిచ్చారు. ఇరాన్ నుంచి భారీ ఎత్తున చమురును దిగుమతి చేసుకొంటూ.. పాకిస్థాన్‌తో సన్నిహిత సంబంధాలు నడుపుతున్న చైనా ప్రస్తుతం ఏ పక్షమూ వహించలేని స్థితిని ఎదుర్కొంటున్నది.

జనన ధ్రువీకరణకు ఆధార్ చెల్లదు

- ఆధార్ ప్రాథమిక గుర్తింపు మాత్రమే
- ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 18: ఆధార్ కార్డుపై ఉన్న పుట్టిన తేదీని 'జనన ధ్రువీకరణ'కు పరిగణనలోకి తీసుకోబోమంటూ ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రకటించింది. పుట్టిన తేదీకి సంబంధించి గుర్తింపు పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగించింది. భారత విశిష్ట ప్రాధికార సంస్థ (ఉడాయ్) ఆదేశాల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈపీఎఫ్‌వో గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆధార్ కార్డును ఇకపై ప్రాథమిక గుర్తింపు పత్రంగా మాత్రమే పరిగణిస్తామని, జనన ధ్రువీకరణకు 'ఆధార్' ప్రామాణికం కాదని ఈపీఎఫ్‌వో పేర్కొన్నది. ఈ మేరకు జనవరి 16 తేదీతో సర్క్యూలర్ విడుదల చేయగా, దీనికి సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ తాజాగా ఆమోదం తెలిపింది. ఇటీవల పలు కేసుల్లో ఆధార్‌ను జనన ధ్రువీకరణ పత్రంగా లెక్కలోకి తీసుకోలేమని కోర్టులు తీర్పు వెలువరించాయి. 'పౌరుడి నుంచి తీసుకున్న వివరాలతో ఆధార్ నంబర్ జారీ అవుతున్నది. ఇది కేవలం విశిష్ట గుర్తింపు సంఖ్య మాత్రమే. పుట్టిన తేదీని ప్రామాణీకరించటం దీంట్లో సాధ్యం కాదని ఆధార్ చట్టం, 2016 చెబుతున్నది. దీనిపై స్పష్టత ఇస్తూ కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ 2018లో మెమోరాండం కూడా జారీచేసింది. దాంతో ఆధార్ కార్డు జనన ధ్రువీకరణకు ప్రామాణికం కాదు' అని ఉడాయ్ తేల్చి చెప్పింది. దీంతో జనన ధ్రువీకరణ పత్రాల జాబితా నుంచి ఆధార్‌ను తొలగిస్తూ ఈపీఎఫ్‌వో కీలక నిర్ణయం వెలువరించింది.

కార్గో నౌకపై డ్రోన్ దాడి

ఆదుకున్న ఐఎన్ఎస్ విశాఖపట్టణం

న్యూఢిల్లీ, జనవరి 18: హిందూ మహా సముద్రంలోని గల్ఫ్ ఆఫ్ ఎడెన్ ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి మార్షల్ ఐల్యాండ్స్‌కు చెందిన ఏంవీ జెన్‌కో పికార్డీ అనే కార్గో నౌకపై డ్రోన్ దాడి జరిగింది. నౌకలో తొమ్మిది మంది భారతీయులు సహా 22 మంది ఉద్యోగులున్నారు. దాడి సమాచారం అందుకున్న గంటలోపు ఐఎన్ఎస్ విశాఖపట్నం స్పందించి దాడి జరిగిన నౌకకు సాయం అందించి మంటలను అదుపులోకి తెచ్చింది. దీంతో నౌక తిరిగి ప్రయాణం మొదలు పెట్టింది. గాజాపై ఇజ్రాయెల్ దాడులను నిరసిస్తూ హౌతీ తిరుగుబాటుదారులు ఇటీవల తరచూ ఇజ్రాయెల్, అమెరికా నౌకలపై దాడులు చేస్తున్న విషయం తెలిసిందే.

పెండ్లి కాని కూతురికి మనోవర్తి హక్కు

అలహాబాద్ హైకోర్టు తీర్పు

లక్నో, జనవరి 18: తల్లిదండ్రుల నుంచి మనోవర్తి (మెయింటెనెన్స్) కోరే హక్కు పెండ్లి కాని కూతురికి ఉంటుందని అలహాబాద్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వయస్సు, మతంతో సంబంధం లేకుండా గృహహింస చట్టం ప్రకారం ఇది వర్తిస్తుందని ధర్మాసనం పేర్కొన్నది. తండ్రి, పిన తల్లి తమ బాగోగులు చూసుకోవటం లేదని ముగ్గురు కూతుర్లు కోర్టును ఆశ్రయించగా, వారికి మనోవర్తి చెల్లించాలంటూ ఉత్తరప్రదేశ్‌లోని ట్రయల్ కోర్టు ఓ కేసులో తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ నయీముల్లా ఖాన్, మరి కొంత మంది అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించగా, వారి పిటిషన్‌ను తిరస్కరిస్తూ హైకోర్టు ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. దిగువ కోర్టు తీర్పును సమర్థించింది. కూతుర్లు ఆర్థికంగా స్వతంత్రులంటూ పిటిషన్‌దారులు చేసిన వాదనను హైకోర్టు తోసిపుచ్చింది. 'ఇక్కడ హిందూ, ముస్లిం, వయస్సులతో సంబంధం లేదు. తన తల్లిదండ్రుల నుంచి మనోవర్తిని కోరే హక్కు పెండ్లికాని కూతురికి ఉందనటంలో ఎలాంటి సందేహం లేదు' అని జస్టిస్ జ్యోత్స్న శర్మ వ్యాఖ్యానించారు.

క్లాస్ వింటుండగా విద్యార్థికి గుండెపోటు.. మృతి

ఇండోర్ కోచింగ్ సెంటర్‌లో ఘటన

ఇండోర్, జనవరి18: కోచింగ్ సెంటర్‌లో పాఠాలు వింటూనే ఓ విద్యార్థి గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. హుటాహుటిన అతడిని దవాఖానకు తరలించినా ప్రాణం దక్కలేదు. ఈ విషాద ఘటన మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో గురువారం ఉదయం చోటుచేసుకున్నది. రాష్ట్రంలోని సాగర్ జిల్లాకు చెందిన రాజా లోధి (20) మధ్యప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఎంపీపీఎస్‌సీ) పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఇండోర్‌లోని ఓ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందుతున్నాడు. గురువారం ఉదయం కోచింగ్ క్లాస్‌కు హాజరైన రాజా.. క్లాస్ వింటూనే ఛాతిలో నొప్పి అంటూ పక్కన కూర్చున్న విద్యార్థికి చెప్తూనే అతడిపై ఒరిగాడు. అతడు రాజా వీపు నిమురుతూ లెక్చరర్‌కు చెప్పే ప్రయత్నం చేస్తుండగా, క్షణాల్లోనే కుర్చీలోని నుంచి నేలపై రాజా పడిపోయాడు. వెంటనే అతడిని సమీప దవాఖానకు తరలించగా, అప్పటికే చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

కాన్పూర్ ఐఐటీలో పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్య

నెల వ్యవధిలో మూడో ఘటన

కాన్పూర్, జనవరి 18: ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ ఐఐటీలో పీహెచ్‌డీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్నది. గురువారం ఉదయం హాస్టల్‌లోని తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. నెల వ్యవధిలో ఇక్కడ ఇది మూడో ఘటన. జార్ఖండ్‌లోని దంకాకు చెందిన ప్రియాంక ఐఐటీ కాన్పూర్‌లో కెమికల్ ఇంజినీరింగ్‌లో పీహెచ్‌డీ చేస్తున్నది. తండ్రి ఎన్ని సార్లు ఫోన్‌చేసినా ప్రియాంక లిఫ్ట్ చేయకపోవడంతో హాస్టల్ మేనేజర్‌కు కాల్‌చేశారు. ఆమె ప్రియాంక గదికి వెళ్లిచూడగా, లోపలి నుంచి గడియ పెట్టి ఉన్నది. తలుపు పగులగొట్టి చూడగా ప్రియాంక సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కనిపించింది. పోలీసులు, ఫోరెన్సిక్ నిపుణులు ఘటనా స్థలికి చేరుకొని ఆధారాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ప్రియాంక ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

గర్భగుడికి చేరిన రామ్ లల్లా

- పండితుల వేద మంత్రోచ్చారణ మధ్య విగ్రహ ఏర్పాటు
- హోరెత్తిన జై శ్రీరాం నినాదాలు
- రామ్ లల్లాకు గణేశ, వరుణ పూజ

అయోధ్య, జనవరి 18: అయోధ్యలో ఈ నెల 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ క్రతువుల్లో భాగంగా గురువారం కీలక ఘట్టం చోటుచేసుకుంది. అయోధ్య రామాలయ గర్భగుడిలోకి రామ్ లల్లా విగ్రహాన్ని చేర్చారు. తెల్లవారుజామునే జై శ్రీరామ్ నినాదాలు, పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య క్రేన్ సహాయంతో విగ్రహాన్ని గర్భగుడిలోకి తీసుకొచ్చారు. అనంతరం బాల రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో రామ్ లల్లాను ప్రతిష్ఠించేందుకు ముందు విగ్రహాన్ని నీటితో శుభ్రం చేసే జలదివస్‌తో పాటు గణేశ పూజ, వరుణ పూజ నిర్వహించారు. కర్ణాటకకు చెందిన అరుణ్ యోగిరాజ్ అనే శిల్పి చేతుల మీదుగా రూపుదిద్దుకున్న 51 అంగుళాల ఈ విగ్రహం బుధవారం రాత్రి అయోధ్యకు చేరగా, క్రేన్ సహాయంతో దానికి ఆలయ ప్రాంగణానికి చేర్చారు. అక్కడి నుంచి గురువారం ఉదయం గర్భగుడిలోకి చేర్చారు. 22న జరిగే ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాలు మంగళవారమే ప్రారంభం కాగా, ఆ రోజు నదీ ఒడ్డున దీపోత్సవం, హారతి, బుధవారం కలశ పూజ వంటి క్రతువులు నిర్వహించారు.

ఆన్‌లైన్‌లో అయోధ్య ప్రసాదం అమ్మకం లేదు

ప్రస్తుతానికి అయోధ్య రాముని ప్రసాదం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచలేదని శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ గురువారం స్పష్టం చేసింది. అయోధ్య ప్రసాదాన్ని ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నామని కొందరు సైబర్ మోసగాళ్లు ప్రకటించడంతో భక్తులు గందరగోళానికి గురవుతున్నారని, తాము ఆన్‌లైన్‌లో ప్రసాదాన్ని అమ్మడం లేదని, దీనికి సంబంధించి ఎలాంటి ఏజెన్సీ, వ్యాపార సంస్థలకు ఫ్రాంచైజీలు ఇవ్వలేదని ట్రస్ట్ క్యాంప్ ఆఫీస్ ఇన్‌చార్జి ప్రకాశ్ గుప్తా వివరించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అనేది లాభాపేక్ష లేని సంస్థ అని, అయోధ్య రాముని దర్శించుకునే వారికి యాలకుల ప్రసాదాన్ని ఉచితంగా పంచుతామని, దానిని చెక్‌పాయింట్లను దాటి ఇతర ప్రాంతాలకు తీసుకెళ్లడానికి అనుమతి లేదని తెలిపారు.

స్మారక స్టాంపుల విడుదల

అయోధ్యలో రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ గురువారం స్మారక తపాల బిళ్లను, ప్రపంచ వ్యాప్తంగా రాముడిపై విడుదల చేసిన స్టాంపుల పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన రామ మందిరం, వినాయకుడు, హనుమాన్, జటాయు, కేవత్రాజ్, మాత శబరి స్టాంపులను విడుదల చేశారు. కాలం, సమాజం, కులం, మతం, ప్రాంతాలకు అతీతంగా అందరితో రాముడు, సీత, రామాయణాలు ప్రతి ఒక్కరి జీవితంలో మమేకమై ఉన్నాయని ప్రధాని తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. రామాయణం మనకు ప్రేమ విజయాన్ని వివరించడమే కాక, త్యాగం, ఐకమత్యం, ధైర్యం, కష్టకాలంలో నిబ్బరంగా ఉండటం వంటి లక్షణాలను అందించిందని ప్రశంసించారు.

22న కేంద్ర ఉద్యోగులకు సగం రోజు సెలవు

అయోధ్య రాముని ప్రాణ ప్రతిష్ఠ జరిగే 22న దేశంలోని అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు సగం రోజు సెలవును మంజూరు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆ రోజు రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవాన్ని ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించేందుకు, వివిధ ప్రాంతాలలో జరిగే ఉత్సవాలలో పాల్గొనడానికి వీలుగా సోమవారం మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు సెలవు ఇస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా ప్రజల నుంచి వస్తున్న డిమాండ్, వారి మనోభావాలను గౌరవించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చెప్పారు.

ప్రపంచంలోనే ఎత్తైన రామాలయం

ఆస్ట్రేలియాలో నిర్మాణం

న్యూఢిల్లీ, జనవరి 18: రామ భక్తులకు మరో శుభవార్త. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రామాలయం ఆస్ట్రేలియాలో నిర్మాణం కానుంది. 721 అడుగుల ఎత్తుండే ఈ ఆలయాన్ని సుమారు రూ.600 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నారు. 150 ఎకరాల విస్తీర్ణంలో శ్రీరామ్ వేదిక్, కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెర్త్‌లో ఇది రూపుదిద్దుకోనుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు గురించి ట్రస్ట్ డిప్యూటీ హెడ్ హరేంద్ర రాణా వివరిస్తూ భారీయెత్తున ఆలయాన్ని నిర్మిస్తామని, ఆలయ కాంప్లెక్స్ ప్రాంగణాన్ని ఆకర్షణీయమైన కట్టడాలతో తీర్చిదిద్దుతామని తెలిపారు.

రాముడికి లక్ష శ్రీవారి లడ్డూలు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): అయోధ్యలో ఈ నెల 22న రామమందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని టీటీడీ శ్రీవారి ప్రసాదంగా లక్ష లడ్డూలను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ సందర్భంగా వచ్చే భక్తుల కోసం 25 గ్రాముల చొప్పున ఉండే లక్ష లడ్డూలను పంపించనున్నది. ఇందు కోసం తిరుమలలోని శ్రీవారి సేవాసదన్-1లో శ్రీవారి సేవకులు ఒక్కో కవర్‌లో రెండు లడ్డూల చొప్పున ప్యాకింగ్ చేశారు. ఇలా మొత్తంగా 350 బాక్సులను సిద్ధం చేశారు.

16 ఏండ్లలోపు వారిని చేర్చుకోవద్దు

- సిబ్బంది కచ్చితంగా డిగ్రీ పాసై ఉండాలి
- ఫలితాలపై మోసపూరిత ప్రకటనలొద్దు
- తప్పనిసరి భద్రత పమాణాలు పాటించాలి
- కోచింగ్ సెంటర్లకు కేంద్రం మార్గదర్శకాలు

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా వివిధ కోర్సులకు ప్రవేశ పరీక్షలు, ఉద్యోగార్హత పరీక్షల కోసం అభ్యర్థులకు శిక్షణ ఇచ్చే కేంద్రాలకు కేంద్ర విద్యాశాఖ నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. విద్యార్థుల ఆత్మహత్యలు నివారించటంతో పాటు వారికి సరైన సౌకర్యాలు కల్పించటం, బోధన విధానాలు మెరుగుపర్చటం, అధిక రుసుములు వసూలు చేయకుండా కట్టడి చేసేందుకు వీటిని రూపొందించినట్టు వెల్లడించింది. ఇందులో భాగంగా శిక్షణ కేంద్రాలకు పలు సూచనలు చేసింది.

మార్గదర్శకాలు

- సెకండరీ పాఠశాల విద్య పూర్తిచేసిన వారిని మాత్రమే కోచింగ్ కోసం పేరు నమోదుకు అనుమతించాలని, 16 ఏండ్లలోపు వారిని చేర్చుకోవద్దని కేంద్రం ఆదేశించింది.
- శిక్షణ కేంద్రాల్లో అర్హులైన సిబ్బందిని నియమించుకోవాలని, వారు తప్పనిసరిగా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని స్పష్టం చేసింది.
- విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించేలా ర్యాంకులు, మార్కుల గురించి ఎలాంటి హామీలు ఇవ్వకూడదని హెచ్చరించింది.
- సిబ్బంది అర్హత, కోచింగ్ సెంటర్ వివరాలు, శిక్షణ అందించే కోర్సులు, వసతి సౌకర్యాలు, ఫీజు రీఫండ్ సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపర్చాలని తెలిపింది.
- ఫలితాలపై మోసపూరిత ప్రకటనలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామంది.
- కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా విద్యార్థులకు చాలినంత స్థలం కేటాయించాలని, కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించింది.
- అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ నష్టం నివారించేందుకు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించింది.
- శిక్షణ ఇచ్చే వ్యక్తి లేదా సంస్థ కోచింగ్ ప్రారంభించిన మూడు నెలల్లో కచ్చితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపింది.
- మార్గదర్శకాలకు విరుద్ధంగా నిర్వహిస్తే గుర్తింపు రద్దు చేసి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించింది.
- ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో శిక్షణ ఇచ్చే సంస్థలు తప్పనిసరిగా ఆయా బ్రాంచ్‌లను రిజిస్ట్రేషన్ చేయాలని స్పష్టం చేసింది.
- విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌తో పాటు మానసిక ఒత్తిడిని అధిగమించేలా కౌన్సెలింగ్ ఏర్పాటు చేయాలని సూచించింది.

గుజరాత్‌లో పడవ బోల్తా 14 మంది దుర్మరణం

మొదటిపేజీ తరువాయి...

వెళ్లారు. సరస్సులో బోట్ షికారు చేస్తుండగా అది బోల్తా పడింది. బోటులో కేవలం 10 మంది మాత్రమే లైఫ్ జాకెట్లు ధరించినట్టు మంత్రి సంఘవి తెలిపారు. నిర్వాహకుల నిర్లక్ష్యాన్ని ఇది తెలియజేస్తున్నదని చెప్పారు. ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు చెప్పారు. విద్యార్థులు ప్రయాణించిన పడవ సామర్థ్యం 16 మంది కాగా, పరిమితికి మించి ఎక్కడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. అంతకు ముందు ఎన్డీఆర్ఎఫ్ అధికారులు మాట్లాడుతూ.. నలుగురు విద్యార్థులు గల్లంతయ్యారని, వారి కోసం గాలిస్తున్నట్టు చెప్పారు. ప్రమాద ఘటనపై గుజరాత్ ప్రభుత్వం అత్యున్నత విచారణకు ఆదేశించింది. మృతుల కుటుంబాలకు 4 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు అందిస్తామని సీఎం భూపేంద్ర పటేల్ తెలిపారు.

ప్రధాని మోదీ సంతాపం..

ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రెండు లక్షలు, గాయపడిన వారికి 50 వేల రూపాయల పరిహారాన్ని ప్రకటించారు. ప్రమాద స్థలానికి గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ చేరుకుని సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

- అయోధ్య రామయ్యకు సిరిసిల్ల బంగారు చీర

సిరిసిల్ల : అయోధ్య రామయ్యకు సిరిసిల్ల బంగారు చీర సిద్ధమైంది. సిరిసిల్లకు చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ దీనిని తయారు చేసి మరోసారి తన ప్రతిభను చాటుకున్నారు. 8 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండితో తయారు చేసిన చీరలో శ్రీరాముడి చిత్రంతోపాటు రామాయణ ఇతివృత్తాన్ని తెలియజేసేలా చిత్రాలను రూపొందించారు. ఈ నెల 26న ఈ చీరను న్యూఢిల్లీలో ప్రధాని మోదీకి అందించనున్నట్టు తెలిపారు.

అయోధ్య రాములోరికి కోనసీమ బోండాలు

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని కోనసీమ నుంచి కొబ్బరి బోండాలను ప్రత్యేకంగా అయోధ్యకు పంపుతున్నారు. రాములోరి కల్యాణానికి ఉపయోగించే విధంగా కల్యాణ బోండాలను కోనసీమ ప్రాంతం నుంచి గురువారం అయోధ్యకు పంపిస్తున్నారు. శంకు, చక్ర నామాలతో రూపొందించిన కొబ్బరి బోండాలను రామమందిరం ప్రారంభోత్సవానికి మండపేటకు చెందిన మహాలక్ష్మి, రామారెడ్డి దంపతులు పంపారు.

పసిడి నిల్వల్లో అమెరికా టాప్

- 9వ స్థానంలో భారత్
- ఫోర్బ్స్ జాబితా విడుదల

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 18 (నమస్తే తెలంగాణ)/ న్యూఢిల్లీ: దేశం ఏదైనా దాని ఆర్థిక స్థిరత్వాన్ని చాటిచెప్పేది బంగారం నిల్వలే. పసిడి నిల్వలు ఎంత ఎక్కువగా ఉంటే ఆ దేశం ఆర్థికంగా అంత పరిపుష్టిగా ఉన్నట్టు లెక్క. 19వ శతాబ్దం నుంచే దేశాలన్నీ బంగారం నిల్వలు పెంచుకోవడం మొదలుపెట్టాయి. 20వ శతాబ్దం నాటికి బంగారం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారింది. దేశంలోని బంగారం నిల్వలకు అనుగుణంగానే కరెన్సీ ముద్రణ కూడా ఉంటుందనేది మనకు తెలిసిన విషయం. కరెన్సీ మార్పిడి రేటు కూడా బంగారం నిల్వల ఆధారంగానే జరుగుతూ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఆర్థిక అస్థిరత సమయాల్లో దేశాన్ని ఆదుకునేది బంగారం నిల్వలే. బంగారం నిల్వలు ఏ దేశం వద్ద ఎంతమొత్తం ఉన్నాయన్న జాబితాను తాజాగా 'ఫోర్బ్స్' విడుదల చేసింది. ఈ జాబితాలోని టాప్-10 దేశాల్లో అమెరికా 8,1336.46 టన్నుల బంగారం నిల్వలతో అగ్రస్థానంలో నిలవగా, బంగారానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చే భారత్ 800.78 టన్నులతో 9వ స్థానంలో నిలిచింది.

టాప్-10 జాబితా

నిల్వలు (టన్నుల్లో)

అమెరికా